నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 17 అక్టోబర్ 2024 | SANGAREDDY

తాగిన మైకంలో విగ్రహాలు ధ్వంసం

ధ్వంసానికి పాల్పడిన వెంకటస్వామి

వర్గల్, అక్టోబర్16: తాగిన మైకంలో ఓ వ్యక్తి గుడి ఆవరణలో విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం..సింగాయి పల్లి గ్రామానికి చెందిన కొప్పోజి వెంకటస్వామి (30)మంగళవారం రాత్రి మద్యం తాగి గ్రామం లోని పెద్దమ్మగుడి ఆవరణలో పోతరాజు, ఇతర విగ్రహాలను ధ్వంసం చేశాడు. సీసీ పుటేజీల ఆధారంగా గ్రామానికి చెందిన వెంకటస్వామి ధ్వంసానికి పాల్పడ్డాడని నిర్ధారణ కావడంతో బుధవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై కరుణాకర్‌రెడ్డి, పోలీస్ బృందం ఘటనాస్థలానికి చేరుకొని వెంకటస్వామి ని అదుపులోకి తీసుకొ ని విచారించగా, నేరం ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని పోలీసులు తెలిపా రు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ గ్రామా ల్లో ఎవరైనా మత విద్వేషాలు రెచ్చగొడుతూ, కులమతాల మధ్య చిచ్చుపెడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

సిద్దిపేటలో డయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు (ఇన్‌సెట్‌లో) 2017లో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అప్పటి మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి(ఫైల్)

ఇవేమి కమిటీలు..?

- గ్రామాల్లో కాంగ్రెస్ నేతల పేర్లతో జాబితాలు
- గ్రామ సభల ఊసే లేదు...ఇష్టారీతిగా కమిటీలు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే, వారు లేని చోట ఇన్‌చార్జిలు
- గ్రామాల వారీగా జాబితాను సిద్ధం చేయిస్తున్న వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న సబ్బండవర్గాలు
- ప్రభుత్వం చెబుతున్నది ఒకటి... చేసేది మరోటి..
- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో కమిటీలే కీలకం
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు
- బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్రాసీడింగ్‌లను రద్దు చేసిన ప్రభుత్వం
- ఇండ్లు నిర్మిస్తున్న వారికి ఇందిరమ్మ ఇండ్లలో అవకాశం ఇవ్వాలంటున్న లబ్ధిదారులు

ఇష్టారీతిగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుతో మండిపడుతున్న ప్రజలు

సంగారెడ్డి జిల్లా కోహీర్ ఎంపీడీవో భారతికి ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ కమిటీలా..? కాంగ్రెస్ కమిటీలా..? ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నేతల పేర్లతో జాబితాను సిద్ధం చేస్తున్నారు. గ్రామసభల నిర్వహణ లేదు. ఎవరికీ సమాచారం లేకుండానే కాంగ్రెస్ నేతలకు నచ్చిన పేర్లతో జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 80శాతానికిపైగా జాబితాలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈనెల 11న ప్రభుత్వం గ్రామాల్లో, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా జీవో విడుదల చేసింది. రెండు రోజుల్లోనే ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయాలని ఆ జీవోలో ఆదేశాలు ఇచ్చింది. అంటే 11,12 తేదీల్లోనే ముగించాలని స్పష్టంగా చెప్పింది. ఆ జీవో ప్రకారం ఎక్కడ కమిటీలు వేయడం లేదు. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి ఆయా మండలాల ఎంపీడీవోలకు, మున్సిపల్‌లో కమిషనర్‌కు పంపించాలని ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతుంది మరోటి. 'ప్రజాపాలన, పారదర్శకత పాలన సమాజంలోని అన్ని వర్గాల స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రుల నుంచి సీఎం దాక ఊకదంపుడు ఉపన్యాసం ఊదరగొడుతున్నారు.' తమది పారదర్శక ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీల పేర్లను గ్రామసభ ఆమోదం లేకుండా ఎలా వేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి దానికి గ్రామసభను నిర్వహించి గ్రామసభలో చర్చించిన అనంతరం కమిటీల పేర్లను పంపడం ఆనవాయితీ. కానీ, కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా తమ పార్టీ నేతల పేర్లను రాసుకొని వాటిని ఆమోదించుకునే పనిలో కాంగ్రెస్ నేతలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే గ్రామాలు, వార్డుల నుంచి కాంగ్రెస్ నేతలు పేర్లను తెప్పించుకుంటున్నారు. గ్రామ, మండల, మున్సిపాలిటీల వారీగా తెప్పించుకొని నియోజకవర్గ ఇన్‌చార్జికి లేదా అక్కడి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు అందిస్తున్నారు. వీటన్నింటినీ జిల్లా మంత్రుల ద్వారా కలెక్టర్‌కు పంపించి ఆమోదింపజేయనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 అసెంబ్లీ స్థానాలు ఉంటే ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న చోట వారి చెప్పిన పేర్లను ఫైనల్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఆరుస్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిల ద్వారా పేర్లు తెప్పించుకొని వాటిని ఆమెందింపజేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలను కాదని ఎలాంటి అర్హత లేని వారి లిస్టులను ఎలా ఆమోదం తెలుపుతారని బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంది. గ్రామసభలు పెట్టకుండా ఇందిరమ్మ కమిటీలు ఎలా ఏర్పాటు చేస్తారని బీఆర్ఎస్ శ్రేణులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

తొలివిడుతలో 40వేల ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేయనున్నారు. అంటే సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో తొలివిడుతలో సుమారుగా 40 వేల ఇండ్ల వరకు మంజూరుకానున్నాయి. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, జనగామ, మనకొండూరు నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు ఉండగా 5 మున్సిపాలిటీల పరిధిలో 115 వార్డులు ఉన్నాయి. ఈ జిల్లాకు సుమారుగా 14 వేల ఇండ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మెదక్ జిల్లాలో 491 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లో 75 వార్డులు ఉన్నాయి. ఈ జిల్లాలో మెదక్, నర్సాపూర్, అందోల్, నారాయణ్‌ఖేడ్, దుబ్బాక శాసనసభ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాలో 9 వేల ఇండ్ల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణ్‌ఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాలో 647 గ్రామ పంచాయతీలుండగా ఎనిమిది మున్సిపాలిటీల్లో 199 వార్డులున్నాయి. సుమారుగా ఇక్కడ 17,500 వరకు రావచ్చు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 45 వేల ఇండ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు సైతం ధ్రువీకరణ పత్రాలు సైతం అందజేసింది. ప్రభుత్వ మారగానే వాటిని పూర్తిగా రద్దు చేసి ఆ లబ్ధిదారులను ఆగం చేసింది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పటికే కొంతమంది ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. మరి కొంత మంది వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని ఇంటి నిర్మాణాలు చేసిన వాటికి, వివిధ దశల్లో ఉన్న వాటికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆ లబ్ధిదారులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ...

గ్రామ పంచాయతీ స్థాయిలో ఏర్పాటయ్యే ఇందిరమ్మ కమిటీకి చైర్మన్‌గా ఆ గ్రామ సర్పంచ్ లేదా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉంటారు. వీరితోపాటు ఇద్దరు స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీలు ఏర్పాటు చేయాలని జీవోలో సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

మున్సిపల్ వార్డుల్లో...

మున్సిపల్ వార్డు కమిటీ చైర్మన్‌గా ఆ వార్డు కౌన్సిలర్ లేదా కార్పొరేటర్‌ను, కన్వీనర్‌గా వార్డు ఆఫీసర్‌ను నియమిస్తారు. వీరితోపాటు ఇద్దరు స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

కమిటీలు నిర్వహించు విధులు...

కమిటీలు కార్యక్రమంపై నిరంతం అవగాహన కల్పిస్తాయి. ఇండ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు చేపట్టేలా నిరంతరం పర్యవేక్షిస్తాయి. సోషల్ ఆడిట్ కమిటీగా వ్యవహరిస్తోంది. ఎవరైనా లబ్ధిదారులు పొరపాటున జాబితాలో చేరి ఉంటే వారిని తొలిగించాల్సిందిగా ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌కు నివేదిస్తుంది. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ జాబితాలో చేర్చాల్సిన లబ్ధిదారుల పేర్లను కలెక్టర్‌కు నివేదిస్తుంది. ఆ తర్వాత కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సంప్రదించి ఇందిరమ్మ కమిటీలను ఖరారు చేస్తారు. ఇందిరమ్మ కమిటీలను ఖారారు చేసి మండలాలు, మున్సిపాలిటీల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఎక్కడ కూడా జీవో ప్రకారం కమిటీల ఏర్పాటు కాలేదు.

15 పడకలతో డయాలసిస్ సేవలు

మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 16: సిద్దిపేటలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌కు మరో ఐదు పడకలు మంజూరైనట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం హైదరాబాదు తర్వాత సిద్దిపేటలోనే తొలి డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటినుంచి అనేకమంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఈ సెంటర్లో డయాలసిస్ సేవలు అందిస్తున్నారన్నారు. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరగడంతో డయాలసిస్ సెంటర్లో మరో ఐదు బెడ్లను కొత్తగా మంజూరు చేశారని, త్వరలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.

78,800 డయాలసిస్ కేసులు

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట నియోజకవర్గంలో ఐదు పడకలతో 2017లో డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యాయి. రోగుల విజ్ఞప్తి మేరకు 2019లో మరో ఐదు పడకలు మంజూరయ్యాయి. ఈ సెంటర్‌లో ప్రస్తుతం వందల మంది రోగులు డయాలసిస్ సేవలను ఉచితంగా పొందుతున్నారు. గతేడాది 78,800 మంది డయాలసిస్ సేవలను పొందారు.

అందోల్ అభివృద్ధికి కృషి

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం బస్వాపూర్ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న మంత్రి దామోదర (ఇన్‌సెట్‌లో) సంగారెడ్డిలో ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ బైకును ప్రారంభిస్తున్న మంత్రి

పుల్కల్, అక్టోబర్ 16: అందోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మరో పదిరోజుల్లో రూ.168 కోట్లతో సింగూరు కాలువల సీసీ లైనింగ్‌కు శంకుస్థాపన చేస్తానని చెప్పారు. పుల్కల్ మండలం బస్వాపూర్ శివారులోని 417 సర్వే నెంబర్‌లోని 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. తొందరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సింగూరు కాలువల ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అందోల్ నియోజక వర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు. ఈ నియోజకవర్గంలో ఉన్నన్ని విద్యాసంస్థలు మరెక్కడా లేవన్నారు. కాగా ఓ విద్యార్థి మాకు రోడ్డు సౌకర్యం సరిగ్గాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చింది. ఎక్కడ నుంచి ఎక్కడి వరకు అని మంత్రి అడగ్గా ముదిమాణిక్యం చౌరస్తా నుంచి ఇటిక్యాల మీదుగా జోగిపేట వరకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థి తెలపడంతో తప్పకుండా ఆ సమస్యను పరిష్కరిస్తానని విద్యార్థినికి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు దుర్గారెడ్డి, రాంచంద్రారెడ్డి, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ నివాసానికి శంకుస్థాపన

సంగారెడ్డి, అక్టోబర్ 16: సంగారెడ్డిలో కలెక్టర్ అధికారి బంగ్లా స్థానంలో నూతన భవనం నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.2.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న కొత్త కలెక్టర్ నివాసం, క్యాంపు కార్యాలయానికి ఎంపీ సురేష్‌శెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డిలతో కలిసి మంత్రి భూమిపూజ చేశారు.

ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ బైకులు ప్రారంభం

సంగారెడ్డిలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐటీఐ ఎదుట సీఎస్ఐ చర్చ సమీపంలో ట్రిపుల్ ఎస్ ఆధ్వర్యంలో గ్లాన్ ఫార్మా పరిశ్రమ సహకారంతో కొనుగోలు చేసిన ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ బైకులను ఎస్పీ చెన్నూరి రూపేశ్, కలెక్టర్ వల్లూరు క్రాంతిలతో కలిసి మంత్రి ప్రారంభించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చిన్నశంకరంపేట, అక్టోబర్ 16: ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన విద్యను అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు గణితం బోధించారు. వంట గదులను, మూత్రశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నుంచి సరైన సమాధానం రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గణితం, ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదోతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇప్పటి నుంచే 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి సిలబస్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణను, మూత్రశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా పాఠశాలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చిన్నశంకరంపేట గ్రామంలోని మురుగు కాలువలను పరిశీలించారు. డ్రైడేను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో డీఎక్స్ఎన్‌లో పండించిన కుంకుమపువ్వును ప్రదర్శిస్తున్న కంపెనీ ప్రతినిధి

డీఎక్స్ఎన్‌లోని కోల్డ్ స్టోరేజ్‌లో సాగు చేస్తున్న కుంకుమ పువ్వు సాగును చూపెడుతున్న కంపెనీ ప్రతినిధులు

డీఎక్స్ఎన్‌లో కుంకుమ పువ్వు సాగు ప్రదర్శన

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16: సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లి గ్రామంలోని డీఎక్స్ఎన్ మ్యానిఫ్యాక్చరింగ్ ఇండియా కంపెనీలో బుధవారం తెలంగాణలోనే అతిపెద్ద ఇండోర్ కుంకుమ పువ్వు సాగుపై ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు డీఎక్స్ఎన్ కంపెనీ ఆవరణలో పరిశ్రమ ప్రముఖులు, వ్యవసాయ నిపుణుల ఆధ్వర్యంలో కుంకుమ పువ్వు సాగు ప్రదర్శన నిర్వహించారు. కుంకుమ పువ్వు పెంపకం ప్రక్రియను, కుంకుమ పువ్వు ధారాల సేకరణలో ఆధునిక పద్ధతులను వివరించారు. ఇండోర్ వ్యవసాయం, వ్యవసాయంలో మార్పు, వనరుల నిర్వహణ, ఆహార భద్రత సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భం గా ఫ్యాక్టరీల ప్రాంతీయ అధిపతి గిరి విజయన్, ప్రాజెక్ట్స్ కోఆర్డినేటర్ పవన్ దేశ్‌పాండే మాట్లాడుతూ..సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో సాంకేతికతను జోడిస్తూ ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కుంకుమ పువ్వు సాగులో ఇదొక అద్భుతమైన విజయమన్నారు. కాశ్మీర్ నుంచి విత్తనాలు తీసుకువచ్చి కంపెనీలో ఒక కోల్డ్ రూమ్ ఏర్పాటు చేసి పంట సాగు చేశామని, సుమారు 4 నెలల్లోనే పంట చేతికి వచ్చిందన్నారు. మార్కెట్‌లో లభించే కుంకుమ పువ్వుతో పోలి స్తే ఇక్కడ పండించిన కుంకుమ పువ్వు ఎక్కువ నాణ్యతతో, సువాసన కలిగి ఉందన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన డీఎక్స్ఎన్ ఫ్యాక్టరీ 50 ఎకరాల్లో విస్తరించి ఉందని, ఇందులో స్థానిక ప్రజలకు, రైతులకు సహాయపడే అనేక ప్రాజెక్టులు జరుగుతున్నాయన్నారు. ఇదేకాకుండా ఈ కంపెనీలో నోని, రోసెల్లె సాగు, కిమోమో ఉత్పత్తి మొదలైనవి జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఇన్‌చార్జి చింగ్ ఎంగ్ బువాన్, సెక్షన్ మేనేజర్ సాయికిరణ్, కుంకుమ పువ్వు సాగు నిపుణులు గౌతమ్ రాథోడ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలు ప్రారంభం

వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను ప్రారంభిస్తున్న సిద్దిపేట మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాధామస్

సిద్దిపేట, అక్టోబర్ 16: సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో ఈఎన్‌టీ విభాగంలో వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను సిద్దిపేట మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాధామస్, దవాఖాన సూపరింటెండెంట్ శాంతి బుధవారం ప్రారంభించారు. ఈ పరికరాలతో వినికిడి లోపాన్ని గుర్తించి సమ స్య తీవ్రత ఆధారంగా సర్జరీలు నిర్వహిస్తామని చెప్పారు. రూ.లక్ష విలువైన సర్జరీలను ఉచితంగా ప్రభుత్వ దవాఖానలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు నాగరాజు, ప్రణీత్‌కుమార్, అమిత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరల్డ్ అనస్థీషియా డే సందర్భంగా దవాఖానలో మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాధామస్, వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఊపిరితీసిన అతివేగం

- ఉసిరికపల్లి శివారులో వాగులోకి దూసుకెళ్లిన కారు
- అక్కడికక్కడే ఏడుగురు మృతి
- తీవ్ర గాయాలతో బయటపడిన డ్రైవర్
- మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గేటు సమీపంలో ఘటన

శివ్వంపేట, అక్టోబర్ 16: అతివేగంగా దూసుకొచ్చిన కారు ఏడుగురు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి బస్టాండ్ సమీపంలోని వాగు బ్రిడ్జి వద్ద బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకున్నది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం..శివ్వంపేట మండలంలోని శంకర్ తండా, సీతారాం తండా, తాళ్లపల్లి తండాకు చెందిన ఎనిమిది మంది సొంత కారులో వర్గల్ మండలం సీతారాంపల్లి తండాలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉసిరికపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చి అదుపుతప్పి వాగులోని తుమ్మచెట్టుకు బలంగా ఢీకొని వాగులో పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహిపాల్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, జేసీబీ సహాయంతో వాగులోని కారును బయట కు తీశారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుకావడంతో మృతదేహాలను తీసేందుకు తీవ్రంగా శ్రమించి బయటకు తీశారు. మృతులంతా గిరిజనులే కావడంతో సమీప తండాల ప్రజలు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతులు మండలంలోని తాళ్లపల్లి తండాకు చెందిన ధనావత్ శివరాం(55), ధనావత్ దుర్గమ్మ(45), జెగ్యాతండాకు చెందిన మాలోత్ అనిత (30), మాలోత్ ఇందు (14), మాలోత్ శ్రావణి (12), భీమ్లా తండాకు చెందిన గుగ్లోత్ శాంతి(45), గుగ్లోత్ మమత(16) ఉన్నారు. మృతుల్లో భీమ్లా తండాకు చెందిన గగ్లోత్ శాంతి, కూతురు గుగ్లోత్ మమత, తాళ్లపల్లి తండాకు చెందిన భార్యాభర్తలు ధనావత్ శివరాం, ధనావత్ దుర్గమ్మ మృతిచెందడంతో వారి ఆక్రందనలు మిన్నంటాయి. భీమ్లాతండాకు చెందిన డ్రైవర్ నామ్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కాగా నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించి, పోస్టుమార్టం కోసం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, బీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ సర్పంచ్‌లు, గిరిజనులు తూప్రాన్ దవాఖాన వద్దకు చేరుకున్నారు. మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా తక్షణ సాయం కింద రూ.25 వేలు అందజేసి వారి కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటానని తెలిపారు.

ఘటనా స్థలం వద్ద పడి ఉన్న మృతదేహాలను చూసి రోదిస్తున్న బంధువులు

నుజ్జునుజ్జయిన కారు

ఘటనా స్థలం వద్ద మృతదేహాలను ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నామ్‌సింగ్